# కాని బదులు

వెంకాయమ్మ ప్రసూతి వైద్యశాలలో డాక్టరు వరలక్ష్మికి మంచి పేరే ఉంది. ఆమె హస్తవాసి మీద చాలామందికి నమ్మకం ఉంది. ఆ అస్పత్రిలోని వైద్యుల్లో ఆమే ఎక్కువ తీరిక లేకుండా ఉంటుంది. ఆమె అక్కడ చాలా సంవత్సరాలనుండి పనిచేస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఎంతో పేరు తెచ్చుకున్న ఆస్పత్రుల్లో ఆమెకు అవకాశాలు వచ్చినా వెళ్లలేదు. అక్కడేపుట్టి, పెరిగి, మెడిసిన్ చదువుకోవడం వలనో ఏమో ఆ ఊరు వదిలి బయటకు వెళ్ళడానికి ఆమెకు ఇష్టం కలగలేదు. ఆస్పత్రి కట్టి నడిపించాలని ఎప్పుడూ అనుకోలేదు. దేనికీ తాపత్రయ పడదు. తనవరకు వచ్చిన జీవితాన్నే స్వీకరిస్తుంది.

వరలక్ష్మి వెంకాయమ్మ కూతురని చాలామంది అనుకుంటూ ఉంటారు. చూడటానికి అలానే ఉంటుంది. నిజానికి కాదు. వెంకాయమ్మ ఆస్పత్రిలో వరలక్ష్మి గాక మరో అయిదుగురు డాక్టర్లు పనిచేస్తున్నారు. వాళ్లు కాకుండా వివిధ విభాగాలకు కన్సల్‌టెంట్స్ మరో నలుగురు వస్తుంటారు. ఆస్పత్రి ఎప్పుడూ కిటకిటలాడుతుంటుంది.

ఆ సాయంత్రం అయిదింటికి వరలక్ష్మి డ్యూటీ అయిపోయింది. తన తర్వాత రావల్సిన రేవతి రాలేదు. రావడానికి గంట ఆలస్యం అవుతుందని వరలక్ష్మికి ఫోనుచేసి చెప్పింది. రేవతి ఎప్పుడోగాని ఆలస్యంగా రాదు. వరలక్ష్మి షిఫ్టుల గురించి పట్టించుకోదు. అవసరమయినప్పుడు ఎంతసేపయినా ఆస్పత్రిలోనే ఉంటుంది. ఆస్పత్రిలో ఏం జరిగినా వరలక్ష్మి ముద్ర ఉంటుంది. ఏ అర్జంటు కేసు వచ్చినా ఎంత రాత్రయినా ఆమెను పిలిపిస్తుంటారు. ఆస్పత్రికి ఆమె ఇల్లు అట్టే దూరంలో లేదు. వరలక్ష్మికి కూడా ఇంటికి వెళ్ళాలని అనిపించడం లేదు. భర్త ఆఫీసు నుండి వచ్చేసరికి ఎనిమిది దాటుతుంది. పిల్లలు స్కూలు నుండి నాలుగింటికి వచ్చి అయిదింటికి ట్యూషనుకు వెళ్ళిపోతారు. ఎనిమిదిన్నరకు గాని తిరిగిరారు. తను ఇంటికి వెళ్ళినా ఒక్కతే కూర్చోవలసి వస్తుంది. ఆవేళ భర్తా పిల్లలతో కలిసి బయటకు

వెళ్ళి ఏ హోటల్లోనో భోజనం చేద్దామని రెండు మూడుసార్లు అనుకుంది. ఫోను చేసి ఈ విషయం భర్తతో చెబుదామని కూడా అనుకుంది. పనుల తొందర్లో చెప్పలేక పోయింది.

వరండాలో ఆయా కనిపించగానే, "బాయమ్మా" పిలిచింది వరలక్ష్మి.

బాయమ్మ గదిలోకి రాగానే, "నాకు కాఫీ కావాలి బాయమ్మా" అంది వరలక్ష్మి.

"రెండు నిమిషాల్లో తీసుకొచ్చి ఇస్తానమ్మా" అంది బాయమ్మ.

"వేడిగా ఉండాలి".

బాయమ్మ తలూపింది.

"కప్పూ సాసరు వేడినీళ్ళలో శుభ్రంగా కడుగు."

బాయమ్మ నవ్వి, "మీరు చెప్పాలమ్మా?" అంది.

"మర్చిపోతావేమోనని గుర్తు చేస్తున్నాను. ఇవేళ తేదీ ఏమిటి?"

"ఇరవయి రెండు... ఏప్రిల్ ఇరవయి రెండు."

గదిలో కేలండరు లేదు. ఉదయం నుండి ఇద్దరి ముగ్గురిని తేదీ ఏమిటని అడిగింది. బాయమ్మ గదిలోంచి బయటకు వెళ్ళాక అరచేతులతో కళ్ళు అదుముకుంటూ ఏప్రిల్ ఇరవయి రెండు అనుకుంది.

వరలక్ష్మి మెడిసిన్ పూర్తి చేయడానికి వెంకాయమ్మ సహాయం చేసిందని వెంకాయమ్మకు దగ్గరవాళ్లు అనుకుంటూ ఉంటారు. నిజానికి కాదు. వెంకయమ్మ మంచిదే. ఆచితూచి సహాయం చేస్తుంది. తొందర పడదు. కాకపోతే జీవితం మీదే కాక అన్ని విషయాల్లో మునుపటంత ఆసక్తి చూపించడం లేదు. వరలక్ష్మి మెడిసిన్ పూర్తి చేయడానికి ఒక సంవత్సరం ఎక్కువ తీసుకుంది.

బాయమ్మ తెచ్చిన కాఫీ తాగడం ముగించిందో, లేదో అస్పత్రి ఆవరణలో చిన్నతరహా కలకలం మొదలయినట్టు అనిపించింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో, కొన్ని ప్రయివేటు ఆస్పత్రుల్లో అప్పుడప్పుడు గొడవలు జరగడం మామూలు విషయం అయిపోయింది. వెంకాయమ్మ ఆస్పత్రిలో ఇప్పటివరకు ఎటువంటి గొడవలు జరగలేదు. అందుకు కారణం వెంకాయమ్మకు ఉన్న పలుకుబడే కాదు, ఆమె మంచితనం డబ్బును కొలబద్దగా ఎప్పుడూ తీసుకోలేదు. ఆమె పోగొట్టుకోడానికి ఇహ ఏమీ లేదు. వెంకాయమ్మ భర్త కూడా డాక్టరే. అతని చదువుకు ఇప్పటికి తను ఎంతో మంచి స్థానంలో ఉండవలసిన వ్యక్తి. అతను మారడు. మెడికల్ కాలేజీలో ప్రొఫెసరుగా పనిచేస్తున్నాడు. ఇటువంటి వాళ్లు ఎటువంటి పనులు చేయడానికైనా

సిద్ధపడే అటువంటి ఎందరిలో ఒక ఉదాహరణ. అతను సంవత్సరాల తరబడి అలవాటు పడ్డాడు. అతనూ వెంకాయమ్మ కలిసి ఉండడం లేదు. విడాకులు తీసుకో లేదు. ఎక్కడయినా, ఎప్పుడయినా కలుసుకున్నప్పుడు బాగానే మాట్లాడు కుంటారు. అతనంటే వెంకాయమ్మకు ఇంతవరకు అసహ్యం పోలేదు.

కుర్చీలోంచి లేచి, కిటికీ దగ్గర నిలబడి తెర పక్కకు లాగి ఆస్పత్రి ఆవరణలోకి చూసింది వరలక్ష్మి. ఆస్పత్రి మెట్ల చివర ఎవరో నిండు చూలాలు సంధితో మెలికలు తిరిగి పోతోంది. చేతులు మెట్లకేసి కొట్టుకుంటోంటే గాజులు పగిలిపోతున్నాయి. నోట్లోంచి నురగ వస్తోంది. నాలుక కొరుక్కుంటోందేమో తెలియడం లేదు. చీర ఊడిపోతోంది. ఆమెకు అవతల ముగ్గురు ఆడవాళ్ళు నిలబడి నిస్సహాయంగా “అయ్యో, అయ్యో” అరవడం మించి ఏమీ చేయలేకపోతున్నారు. ఆ చూలాలికి పద్దెనిమిది సంవత్సరాలు మించి ఉండవు.

“బాయమ్మా” కేకేసింది వరలక్ష్మి.

“అమ్మా, వస్తున్నా” మాట వెనకే బాయమ్మ పరుగెత్తుకుంటూ వచ్చింది. ఆమె వెనకే యాదయ్య కూడా వచ్చాడు.

“యాదయ్యా, ఎవరినయినా తీసుకుని పాపం ఆ పిల్లను ఎమర్జెన్సీ గదిలోకి తీసుకెళ్లండి. ఏ మాత్రం ఆలస్యం చేయకు. స్ట్రెచర్ మీద జాగ్రత్తగా తీసుకువెళ్లు. నీకు తోడుగా మరో ఇద్దరు ఆయాలను తీసుకువెళ్ళు....” యాదయ్య వెళ్ళిపోయాడు. అరచేతులతో కళ్లు అదుముకుని ‘ఇవేళ ఏప్రిల్ ఇరవయి రెండు’ అనుకుంది. బాయమ్మ వయిపు తిరిగి, “బాయమ్మా, ఆపరేషన్ థియేటరు సిద్ధం చేయమని మెర్సీ సిస్టరుకు చెప్పు....త్వరగా వెళ్ళు.... ” అంది వరలక్ష్మి. ఆ వేళ ఆమె ఎందుకంత కంగారు పడుతోందో బాయమ్మకు అర్థం కాలేదు.

అరగంట తర్వాత వరలక్ష్మి వెంకాయమ్మకు ఫోను చేసి “ఎవరో ఒక నిండు చూలాలిని ఆటోలో తీసుకు వచ్చి మన ఆస్పత్రి మెట్ల దగ్గర పడేసి వెళ్ళిపోయారు. ఆ పిల్లకు మహా ఉంటే పద్దెనిమిది సంవత్సరాలుంటాయి. ఆ పిల్ల స్పృహలో లేదు. ప్రథమ చికిత్స చేశాను. ఆమెకు తోడుగా ఎవరూ లేరు. రాలేదు. ఏంచేద్దామన్నా ఎవరి సంతకమయినా కావాలి. ఆమె పేరేమిటో తెలియదు. స్పృహలోకి వస్తుందని నాకు అనిపించడం లేదు. రక్తం లేదు. పాలిపోయి ఉంది. రక్తస్రావం అవుతోంది. అరగంటలో ఏయినా చేయకపోతే తల్లో బిడ్డో లేక ఇద్దరూ చనిపోవచ్చు. మన

అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి పంపించొచ్చు. చేరేవరకు అనుమానం. ఫిట్స్ పూర్తిగా తగ్గలేదు. నాకు ఏం చేయాలో తోచడం లేదు...." అంది.

"కూల్‌గా తీసుకో. ఇప్పటివరకు ఎన్నో కాన్పులు చేశావు. కొద్దిసేపట్లో ఫిట్స్ ఆగిపోతాయి.... ఇంజక్షన్లు ఇచ్చే ఉంటావు." నిబ్బరంగా అంది వెంకాయమ్మ.

"ఎట్టిపరిస్థితిలోనూ మామూలు కాన్పు కాదు."

"ఇద్దరిలో ఎవరికి ఎక్కువ ప్రమాదం ఉంది?"

"బిడ్డకు."

"ఏం చేద్దామని అనుకుంటున్నావు?"

"అయాం కన్‌ఫ్యూజ్‌డ్."

"అది నాకు అర్థం అయింది.. అవసరం అనిపిస్తే ఆపరేషన్ చేసేయి. ఏమయినా అయితే గొడవ అవుతుందని భయమా?"

"అదేం లేదు."

"దెన్ గో ఎహెడ్. నేనున్నాను. ఏదయినా అయితే నేను చూసుకుంటాను. పోలీసులతో నేను మాట్లాడతాను. ఏమనుకోకు. నేను ఒక్కమాట అడుగుతాను. ఇవేళ నీకేమయింది? ఆర్‌యూ ఓకే చిన్నా?" అడిగింది వెంకాయమ్మ.

వరలక్ష్మిని వెంకాయమ్మ ఒక్కతే 'చిన్నా' అని పిలుస్తుంది. ఇంకెవరికీ తెలియదు. ఆ మాటతో వరలక్ష్మికి కొద్దిగా ధైర్యం వచ్చినట్టు అనిపించింది. "యస్. అయాం ఓకే."అంటోంటే ఆమె కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

"రేయ్ చిన్నా, చూస్తుండు. తల్లీ బిడ్డా ఇద్దరూ బతుకుతారు..." ఫోను పెట్టేసింది వెంకాయమ్మ.

ఆ పిల్లకు ఆపరేషన్ చేయకుండా మామూలు కాన్పుకయి వరలక్ష్మి నేర్పుగానే ప్రయత్నించింది. కాన్పు అయిన ముప్పావుగంట తర్వాత బతికి ఉన్న కొడుకును ఒక్కసారయినా చూసుకోకుండా ఆ తల్లి చనిపోయింది. 'నేను ఓడిపోయాను' అనుకుంది వరలక్ష్మి. 'ఇవేళ ఏప్రిల్ ఇరవయి రెండు కాకుండా ఉండాల్సింది' అని కూడా అనుకుంది.

రాత్రి ఎనిమిది గంటల దాటిన తర్వాత పోలీసులు వచ్చి చనిపోయిన ఆమె గురించి రొటీను ప్రశ్నలు వేసి జవాబులు రాసుకున్నారు. ఎవరి దగ్గర సంతకాలు తీసుకోలేదు. ఆమె ఫొటోలు తీసి ఆస్పత్రి ముఖద్వారం దగ్గర ఇద్దరు పోలీసులను కాపలా పెట్టి వెళ్ళిపోయారు. ఆమెను తీసుకువచ్చిన ఆటోనెంబరు మటుకు

సంపాయించగలిగారు. పది అయినా చనిపోయిన ఆమె తాలూకు మనుషులు ఎవరూ రాలేదు.

రేవతి కూడా రాలేదు.

వరలక్ష్మి ఆస్పత్రి నుండి బయటకు వచ్చేసరికి పదీ ఇరవయి అయింది. ఆస్పత్రి కారులో గాని, భర్తకు ఫోను చేసి ఇంటినుండి కారు తెప్పించుకుని అందులో గాని వెళ్ళాలనిపించలేదు. ఆస్పత్రి ముందు ఆటోలు వరసగా నిలబడి ఉన్నాయి. ఎక్కాలనిపించలేదు. నడుచుకుంటూ వెళ్దామని నడవడం మొదలెట్టింది.

ఆస్పత్రి పక్కనే ఇంజనీరింగ్ కాలేజి, అది దాటాక పార్కు ఉన్నాయి. పార్కు చుట్టూ తిరిగి వెళ్తే తాము ఉంటున్న కాలనీ వస్తుంది. పార్కులోంచి కూడా అడ్డదారి ఉంది. ప్రహరీగోడకు మనిషి పట్టే ఇనప తలుపు ఉంది. రాత్రిళ్లు ఆ అడ్డదారి నుండి ఎవరూ రారు. ఉదయం నుండి కళకళలాడే ఇంజనీరింగ్ కాలేజి సాయంత్రం అయ్యేసరికి బోసి పోయింది. నిండుగా లయిట్లు ఉన్నా బిక్కు బిక్కు మంటూ ఉంటుంది. లయిట్లు లేకపోయినా పురపాలక సంఘం పార్కు సందడిగానే ఉంటుంది. అసలు లయిట్లు వేయరని కాదు. వేస్తుంటారు. వేసిన రెండోరోజుకే అవి మాడిపోనన్నా మాడిపోతాయి. లేదా పగిలిపోతాయి. పురపాలక సంఘం వాళ్ళకు విసుగేసి కొత్తవి వేయడం మానేశారు.

సాయంత్రం వరకు జంటలతో, పిల్లా పాపలతో ఉత్సాహంగా ఉండే పార్కు చీకటి పడడం మొదలెట్టాక మందురాయుళ్ల పాలవుతుంటుంది. రూలు ప్రకారం తొమ్మిది దాటాక పార్కులో ఎవరూ ఉండకూడదు. కాపలాదారు తనకు మందు కొట్టీయందే ఉండనీయడు.

ఆ రాత్రి వరలక్ష్మికి పార్కులోంచే వెళ్దామనిపించింది. చిన్నప్పటి నుండి పార్కు పక్కన ఉన్న కాలనీలో ఉంటున్నందువలన పార్కు గురించి ఆమెకు బాగా తెలుసు. దాని చుట్టుపక్కల ఎన్నో కాలనీలు వచ్చి అభివృద్ధి చెందినా, పక్కనే ఇంజనీరింగ్ కాలేజి వచ్చినా పార్కు ఏం మారలేదు. సంవత్సరాలు గడిచినా అవే సిమెంటు బెంచీలు. కొత్త చెట్లు ఏమీ పెంచలేదు. అప్పట్లో చిన్నగా ఉండే చెట్లు చాలా పెద్దవయ్యాయి.

వరలక్ష్మి నడుస్తోంటే చెట్లు చాటునుండి సీసాల, గ్లాసుల చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. బూట్లకింద గాజు ముక్కలు నలుగుతూ శబ్దమవుతున్నాయి. నిండు వెన్నెల వెలుగు చల్లగా ఉంది. దారి స్పష్టంగా కనిపిస్తోంది.

పార్కు మధ్యకు వచ్చింది. నడిచినంత దూరం నడిస్తే చాలు కాలనీ వస్తుంది. వేపచెట్టుకు అవతల ఉన్న సిమెంటు బల్ల దగ్గరకు వచ్చింది. గుండె వేగంగా కొట్టుకుంటోంది. బల్లమీద ఎవరో వెల్లకిలా పడుకుని ఉన్నాడు. నిద్రపోతున్నాడో, మెలకువగా ఉన్నాడో తెలియడం లేదు. శబ్దం కాకుండా చేతి గాజులను వెనక్కి లాక్కుని బల్లకు దగ్గరగా నిలబడింది. అతనికి ఇరవయి సంవత్సరాలుంటాయేమో, చేతుల బనియను, పొడుగాటి పేంటు తొడుక్కుని ఉన్నాడు. అవి వాటి రంగో, మాసిపోయిన గుడ్డల్లో ఉన్నాడో తెలియడం లేదు. అతని ముఖం చూడాలనిపిస్తోంది. ఊపిరి బిగబట్టి ముందుకు వంగి అతని ముఖంలోకి చూసింది. అతని కళ్ళు మూసుకుని ఉన్నాయి. నిద్రపోతూండవచ్చు. నుదురు పెద్దగా ఉంది. ముక్కు పొడుగ్గా ఉంది.

అయిదు క్షణాలు పరీక్షగా చూసి ఉంటుందేమో, అతను హఠాత్తుగా కళ్ళు తెరిచి లేచి కూర్చుని వరలక్ష్మి చేయి పట్టుకున్నాడు. అతనలా పట్టుకుంటాడని ఆమె ఊహించలేదు. గుండె ఝల్లుమంది. ఎక్కడలేని ధైర్యం తెచ్చుకుని ఒక్క ఊపుతో అతని చేతిపట్టు విదిలించుకుని పరుగెత్తడం మొదలెట్టింది.

రెండు నిమిషాల్లో పార్కు ఇనప తలుపు దాటుతోంటే, 'అమ్మా, నేనమ్మా, నీ చిన్నాను' అని గుండె లోతుల్లోంచి అరిచినట్టు అనిపించింది. వరలక్ష్మి ఆగలేదు.

ఇరవయి సంవత్సరాల కిందట ఏప్రిల్ ఇరవయి రెండున మగబిడ్డను పొత్తిగుడ్డల్లో భద్రంగా చుట్టి ఆ రాత్రి అదే సమయాన, ఆ సిమెంటుబల్ల కిందే పెట్టి అలానే పారిపోయింది. పుట్టి ఇరవయి నాలుగు గంటలు కూడా నిండలేదు. బిడ్డ ఆకలికి తట్టుకోలేడేమోనని కడుపునిండా పాలు ఇచ్చింది. కాకపోతే ఆ రాత్రి చీకటిగా ఉంది.

❖